ప్రజాశక్తి
మంగళవారం 22 జులై 2025 5
శ్రీ సత్యసాయి





మడకశిర బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వనిత



# అక్కడక్కడ వాన..!

◆ రెండు రోజులుగా తేలికపాటి వర్షం ◆ పూర్తి స్థాయి పదునయ్యేదెన్నడో .?

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

గడిచిన రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు అక్కడక్కడా పడుతున్నాయి. పడిన వర్షం కూడా ఎక్కడా పెద్ద స్థాయిలో లేదు. తేలికపాటి వర్షాలే పడుతున్నాయి. జూన్ మాసం ఆరంభమైనప్పటి నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. వాతావరణంలో నెలకొన్న మార్పుల నేపథ్యంలో రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు పడుతున్నా పూర్తి స్థాయిలో పదునైంది లేదు.

**రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు**

అనంతపురం జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. అంతటా తేలికపాటి వానలే పడ్డాయి. ఈనెల 19వ తేదీన అనంతపురం అర్బన్, విడపనకల్లు కుందుర్పి మండలాల్లో ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. అనంతపురం నగరంలో 22.8 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం పడింది. నగరంలో కావడంతో ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. విడపనకల్లులో 22.2 మిల్లీమీటర్లు పడింది. కుందుర్పి 19.6 మిల్లీమీటర్లు నమోదయింది. తక్కిన చోట్ల తేలికపాటి వర్షాలు పడినప్పటికీ 19 మండలాల్లో చినుకుజాడలేదు. 20వ తేదీ ఆదివారం యాడికి మండలంలో అత్యధికంగా 32.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. పెద్దపప్పూరు 21.2 మిల్లీమీటర్లు, గుంతకల్లు 17.2 మిల్లీమీటర్లు పడింది. ఆదివారం కూడా 18 మండలాల్లో చినుకుజాడ లేదు. రెండు రోజులుగా వర్షాలు పడుతున్నట్టు మేఘాలు కమ్ముకుని వస్తున్నా కేవలం ఐదు మండలాల్లోనే ఒక మోస్తరు వర్షపాతం పడింది. సోమవారం నాడు అక్కడక్కడ వర్షం పడింది. అత్యధిక మండలాల్లో వర్షం కోసం రైతులు ఇప్పటికీ ఆకాశం వైపు ఎదురు చూస్తూనే ఉన్నారు.

**కొనసాగుతున్న వర్షాభావం**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతున్నాయి. 90.5 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షం 59.1 మిల్లీమీటర్ల ఉంది. సత్యసాయి జిల్లాలోనూ ఇదే పరిస్థితులే కొనసాగుతున్నాయి. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 102.9 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షం 43.1 మిల్లీమీటర్లు అనంతపురం జిల్లాలో 34.7 శాతం వర్షపాతం లోటు ఉండగా, సత్యసాయి జిల్లాలో 58.1 శాతం వర్షపాతం లోటు నెలకొంది. మండలాల వారీగా చూస్తే అనంతపురం జిల్లాలో 21 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

**'అనంత'లో వర్షం**

అనంతపురం నగరంలో సోమవారం రాత్రి ఒక మోస్తరు వర్షపాతం నమోదయింది. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ వంటి ప్రధాన కూడళ్లలో నీరు పెద్దఎత్తున ప్రవహించింది. దీంతో కొంతసేపు రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి.

## చేసిన మంచిని ప్రజలకు తెలుపుతున్నాం..

◆'సుపరిపాలనలో తొలి అడుగు'కు స్పందన
◆జగన్ మాటలను నమ్మొద్దు
◆రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

**ప్రజాశక్తి-మడకశిర, మడకశిర టౌన్**

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరించడానికే 'సుపరిపానలో తొలిఅడుగు' కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో సోమవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి అనిత, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి మడకశిర, గుడిబండ మండలాల్లో పర్యటించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. ముందుగా వాల్మీకి, అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అన్న క్యాంటీన్‌ను సందర్శించి భోజనం ఎలా ఉంది.. రుచిగా ఉందా.. శుభ్రంగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. మడకశిరలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి అనిత మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం అమలు చేశామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామన్నారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని, వాటి నుంచి విముక్తి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజలను మోసం చేసేందుకు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ప్రజల వద్దకు వస్తారని, ఆయన్ను ఎవరూ నమ్మొద్దన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో మడకశిరలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలియజేశారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజన్నప్ప, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం.పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్.గురుమూర్తి, మండల కన్వీనర్లు నాగరాజు, లక్ష్మీనర్సప్ప, కృష్ణమూర్తి, తిప్పేస్వామి, ఈరన్న, నాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు కన్నా, మద్దనకుంటప్ప, గణేష్, కుమారస్వామి, దాసిరెడ్డి, వైజాగ్ రమేష్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అజెండాపై కౌన్సిల్ సభ్యుల అసంతృప్తి

సమస్యలపై ఏ ఒక్కరూ స్పందించరంటూ ఆవేదన - అధికారులకు ఇష్టం వచ్చినట్టు ప్రతిపాదనలు చేస్తే ఎలా..?

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పురపాలక సంఘం అత్యవసర సమావేశం సోమవారం మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 22 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల దష్టికి తీసుకువచ్చారు. అజెండాపై అటు అధికార టిడిపి కౌన్సిలర్లతో పాటు ప్రతిపక్ష వైసిపి కౌన్సిలర్లు సైతం తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేశారు. అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి కౌన్సిల్ సభ్యుల దష్టికి తీసుకువచ్చిన అభివద్ధి పనుల్లో ఏ ఒక్కటైనా ఆయా వార్డు కౌన్సిలర్లకు అడిగి ప్రతిపాదనలు సిద్ధం చేశారా అంటూ పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. కౌన్సిలర్ రహమత్ బి తన వార్డులో ఇప్పటివరకు ఒక్క అభివద్ధి పని సైతం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు అభివద్ధి కోసం అధికారంలో ఉన్న టిడిపికి మద్దతు ఇచ్చినప్పటికీ ఒక్క పైసా కూడా తన వార్డుకు కేటాయించలేదని, ఛైర్మన్ ఎంపిక జరిగే వరకు తమకు మాయ మాటలు చెప్పి ఇప్పుడు కూరలో కరివేపాకులా తీసి వేస్తున్నారని 7వ వార్డు కౌన్సిలర్ నాసిరాబాదు విమర్శలు చేశారు. దీనిపై స్పందించిన ఛైర్మన్ రమేష్ కుమార్ గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో అభివద్ధిపై ఎందుకు ప్రశ్నించ లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు మాత్రమే అయ్యిందని, త్వరలో అన్ని వార్డులకూ నిధులు కేటాయించి అభివద్ధి చేస్తామని కౌన్సిల్ సభ్యులు కాస్త ఓపికతో ఉండాలని సూచించారు. అధికారులకు ఇష్ట వచ్చిన విధంగా అభివద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని, తమ వార్డులో చాలా సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ఏమాత్రం పట్టించుకోవడంలేదని 24వ వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర మండిపడ్డారు. పలువురు కౌన్సిలర్లు ప్రతినెల జరిగే కౌన్సిల్ సమావేశంలో కోట్లాది రూపాయల అభివద్ధి పనులకు అధికారులు ఆమోదం తీసుకుంటున్నారని, అయితే పనులు ఎక్కడ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో వచ్చిన వరదల కారణంగా కేవలం హిందూపురం పురపాలక సంఘంలో రూ. 2 లక్షలు మాత్రమే నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని కౌన్సిలర్ రాఘవేంద్ర అన్నారు. పురపాలక సంఘంలో ఉన్న కరువు నిధులు మరమ్మతుల పేరిట అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలపై పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి పనులు చేపట్టాలని సూచించారు. కౌన్సిలర్ల వాదనలు, ప్రతివాదనల నడమునే అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ దస్తగిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ వాణి, ఏఈలు జనార్ధన్, శంకర్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో చైర్మన్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ రహమత్ బి (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్ కుమార్)

## మున్సిపల్ కార్మికుల భిక్షాటన

**ప్రజాశక్తి-హిందూపురం**

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహిస్తు, భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ నెల రోజుల నుంచి పారిశుధ్య కార్మికులు వివిధ రూపాలుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ కార్మికులపై ప్రభుత్వనికి కాసింతనైన కనికరం కలగడం లేదన్నారు. మున్సిపాల్టీలో గత 35 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూ పట్టణ సుందరీకరణకు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల న్యాయమైన సమస్యలను మాత్రం పరిష్కరానికి నోచుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కార్మికుల కనీస వేతనం, ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు గుర్నాథ్, రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవితమ్మ, గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.



హిందూపురంలో మున్సిపల్ కార్మికుల భిక్షాటన ర్యాలీ

**జీవో-36 అమలు చేసే వరకు సమ్మె ఆగదు**

**పుట్టపర్తి క్రైమ్ :** రాష్ట్ర ప్రభుత్వం జీవో-36 అమలు చేసే వరకూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె విరమించబోమని మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సమ్మెలో భాగంగా సోమవారం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ అర్ధనగ్నంగా భిక్షమెత్తి నిరసన తెలిపారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం వేతనం రూ. 3500 పెంచుతున్నట్లు సర్క్యులర్ విడుదల చేయడంపై తాము సంతృప్తిగా లేమన్నారు. జీవో-36 ప్రకారం రూ. 21 నుంచి రూ. 26 వేల వేతనం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్న డిమాండ్‌ను ఆ సర్క్యులర్‌లో ప్రస్తావించలేదన్నారు. తమ డిమాండ్లను అరాకొరగా అమలు చేస్తామంటే ఒప్పుకోమన్నారు. అన్ని సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు రమణ, రామదాసు, గణేష్, రమేష్, శివ, సద్దాంహుస్సేన్, పారిశుధ్య కార్మికులు రామయ్య, పెద్దన్న, గోవిందు, నాగార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపిడిఒలు, అధికారులు

## జెసిపిఆర్ క్షమాపణ చెప్పాలి

**కలెక్టరేట్ ముందు ఉద్యోగుల సంఘం నిరసన**

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని జిల్లా ఎంపిడిఒల సంఘం, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అనంతపురంలో జిల్లా పంచాయతీ అధికారిపై జెసి ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్యోగులను కించపరిచేలా ఉన్నాయన్నారు. ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజాప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ టిఎస్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు నరేంద్ర, నసీమ, నటరాజ్, రఘునాథ్‌గుప్తా, నాగేశ్వర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, ఈశ్వర్, శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి : డిఇఒ

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం ఆగస్టు 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. 2024 డిసెంబర్ 8వ తేదీ జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. బ్యాంకు ఖాతాలో కానీ, ఆధార్ కార్డులో కానీ తప్పు ఒప్పులు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు డిబిటి ద్వారా స్కాలర్‌షిప్ డబ్బులు జమ అవుతాయన్నారు.

## అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

వివిధ సమస్యలపై అర్జీదారులు అందించే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా వాటికి పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 260 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ రెడ్డి, రామసుబ్బయ్య, ఆర్డీవో సువర్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు సంతప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్, ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ కాకుండా చూడాలన్నారు. జిల్లాలో ప్రధానంగా ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ల మంజూరు తదితర అంశాలతో కూడిన అర్జీలు వస్తున్నాయని, వీటిపై సంబంధిత అధికారులు స్పందించాలని ఆదేశించారు.

**త్వరితగతిన రీ సర్వే పనులు పూర్తి చేయండి**

**జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్**

జిల్లాలోని 32 గ్రామాల్లో రీ సర్వే పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, రీ సర్వే తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను కాలపరిమితి మించకుండానే పరిష్కరించలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, సర్వే ల్యాండ్ ఏడీ విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు**

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వారు సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం తుమ్మల కుంట్లపల్లికి వెళ్లి ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్ నాయకులు నబి కుటుంబాన్ని పరామర్శిం చారు. అలాగే నల్లగుట్లపల్లి వెళ్లి వెంకటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బసప్పగారిపల్లిలో ఈశ్వరప్ప భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వెంకటా పురం, నల్లగుట్లపల్లి రహదారి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సర్పంచి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, గ్రామస్తులు కోరారు. ప్రజలు తాగునీటి సమస్యను ప్రస్తావించగా సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ గంగాధర్‌ను ఆదేశించారు. వారి వెంట మండల కన్వీనర్ జయచంద్ర, ఒడిసి, అల్లాపల్లి సొసైటీల అధ్యక్షులు తుమ్మల మాబాషా, బోయపల్లి శివారెడ్డి ఉన్నారు.



తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

**టిడిపి నేత మృతికి ఎమ్మెల్యే నివాళి**

**నల్లమాడ :** మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వరదప్ప(63) మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆ గ్రామం వెళ్లి వరదప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. ఇటీవల మృతిచెందిన టిడిపి కార్యకర్త వేమయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. వారి వెంట టిడిపి మండల నాయకులు మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణంనాయుడు, సర్పంచి రమావత్ భారతి చాంప్లా నాయక్ ఉన్నారు.

## గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ సర్వే నెంబర్-720లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం లబ్ధిదారులతో కలిసి కుమ్మరవాండ్లపల్లి సచివాలయం-1లో గ్రీవెన్స్‌సెల్‌లో వీఆర్వోకి వ్యక్తిగతంగా అర్జీలు అందజేశారు. సిపిఎం కదిరి ప్రాంతీయ కార్యదర్శి జగన్మోహన్, సాంబ శివ, బాబ్‌జాన్ మాట్లాడుతూ కదిరి పట్టణంతో పాటు రూరల్‌లో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని 4 నెలల నుంచి సచివాలయం, తహశీల్దార్ కార్యాలయాల్లో పేదలు వ్యక్తిగతంగా అర్జీలు ఇచ్చినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇకనైనా గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల స్థలాలు, పునాదులు వేసిన వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పేదలు కాంతమ్మ, భారతి, లక్ష్మీదేవి, పుష్ప, సరస్వతి, లక్ష్మీ, మాబున్నిసా, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

**ప్రజాశక్తి-తాడిమర్రి**



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

స్థానిక కెజిబివిలో సోమవారం ప్రిన్సిపల్ వాణిశ్రీ ఆధ్వర్యంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప కంటి పరీక్షల స్క్రీనింగ్ నిర్వహించారు. మొత్తం 237 మందికి ఈ పరీక్షలు చేయగా 15 మంది విద్యార్థులకు చూపు సమస్య ఉన్నట్లు గుర్తించారు. వీరికి కళ్ల అద్దాల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. అలాగే డాక్టర్ హరిత హాస్టల్‌ను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి సలహాలు ఇచ్చారు. ఆరోగ్యం సరిగా లేని పిల్లలకు చికిత్స చేశారు. కార్యకరంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, లక్ష్మీదేవి, ఎఎన్ఎం కోమల, శివమ్మ, హెల్త్ అసిస్టెంట్ హర్షవర్ధన్, ఆశా వర్కర్ నర్సమ్మ పాల్గొన్నారు.



టిడిపిలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కందికుంట

## వైసిపి నుంచి టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

గాండ్లపెంట మండలంలోని కటారుపల్లి పంచాయతీ సాదులవాండ్లపల్లికి చెందిన 10 కుటుంబాలు వైసిపిని వీడి సోమవారం కదిరి పట్టణంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో గోపన్న, నాగరాజు, బి.శంకర్‌నాయక్, పి.సూర్యనారాయణ, బి.చలపతి నాయుడు, శ్రీరాములు, ఎం.బయప్ప, శైలజకుమారి, కె.చలపతి ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సి.కొండయ్య, వెంకటరమణరెడ్డి, ఎంపిపి సోమశేఖర్‌రెడ్డి, కేశవ్‌రెడ్డి, దాసిరెడ్డి, గోపాల్‌నాయక్, గోపాల్, శీనవాయక్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

## ఓడిసి సింగిల్‌విండో అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా

**ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు**

ఓడిసి ప్రాథమిక సహకార సొసైటీ(సింగిల్‌విండో) నూతన అధ్యక్షులుగా తుమ్మల మహబూబ్ బాషా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మహబూబ్‌బాషా చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తాని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు పిట్టా ఓబుల్‌రెడ్డి, ఆరిఫ్‌ఖాన్, షాను, చాంద్‌బాషా, సోదీ నాగరాజు, కిష్టప్ప, బీరంసాబ్, తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వేయర్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

మండల నూతన సర్వేయర్‌గా మైనుద్దీన్ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కన పని చేస్తున్న శ్రీనివాసరావు సాధారణ బదిలీపై పెనుకొండకు వెళ్లారు. పెనుగొండ డివిజన్‌లోని రొద్దం మండలంలో 9 ఏళ్లుగా సర్వేయర్‌గా పని చేస్తున్న మైనుద్దీన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. తహశీల్దార్ మురళీకృష్ణ, రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు.

## టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి-తనకల్లు**

మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వెంకటరమణ ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ప్రమాదం జరిగి గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ స్థానిక పార్టీ నాయకులు హరినాయక్, భాస్కర్‌రెడ్డి వెంకటరమణకు రూ. 15 వేలు అందజేశారు.

## న్యాయం చేయాలని మాజీ సైనికుడి కుటుంబ సభ్యుల వినతి

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

కొందరు వ్యక్తులు తమ భూమిని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని రైతు గూడా శ్రీనివాసులు వాపోయాడు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు కుటుంబ సమేతంగా వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టిఎస్.చేతన్‌కు ఫిర్యాదు చేశారు. కొత్తచెరువు బిసి కాలనీలో నివాసం ఉంటున్న రైతు గూడా శ్రీనివాసులుకు కప్పలబండ పొలంలో 5.25 ఎకరాల పొలం ఉంది. దీనికి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అయిన తన తండ్రి వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం 1974లో పాసుబుక్కు మంజూరు చేసింది. అయితే అగ్రహారం కిష్టప్ప అనే వ్యక్తి 1-బి మార్చి భూమిని ఆక్రమించాడని వాపోయారు. పంట సాగు చేయగా కిష్టప్ప దౌర్జన్యంగా నాశనం చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

## కక్షతోనే వైసిపి ఎంపి అరెస్టు

**ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు**

కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని వైసిపి మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మహమ్మాదాబాద్ క్రాస్‌లో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయలేక ప్రజల దృష్టిని మరలించేందుకు ఒక్కోసారి ఒక్కో ప్రముఖ వైసిపి నాయకుడిని అక్రమంగా అరెస్టు చేస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. సమావేశంలో వైసిపి నాయ కులు కొల్లి నర్సిరెడ్డి, కోళ్ల కృష్ణారెడ్డి, రంగారెడ్డి, హనుమంతరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుకన్య, వీరాంజి పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంజునాథ్

**ఓబుళదేవరచెరువు :** వడ్డెర, వడియరాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన న్యాయవాది సాతర్ల మంజునాథ్‌ను నియమించారు. మంజునాథ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు న్యాయవాది వేముల బేబీ రాణికి ధన్యవాదాలు తెలిపారు. తన సామాజిక వర్గానికి చెందిన వారికి ఎక్కడ అన్యాయం జరిగినా అండగా ఉంటానని, వడ్డెర సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'సుపరిపాలనలో తొలిఅడుగు'

## రాష్ట్ర మంత్రులు అనిత, సవిత



ఎన్టీఆర్ విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న హోం మినిస్టర్ వంగలపూడి అనిత

**ప్రజాశక్తి-గుడిబండ**

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిం చడంతో పాటు ఈ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికే 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం చేపట్టామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర బిసి సంక్షేమ, జౌళిశాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. వారు ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజుతో కలిసి సోమవారం గుడిబండలో పర్యటించారు. ముందుగా స్థానిక నాయకులు బాణ సంచా పేలుస్తూ మేళ తాళాలతో ఆహ్వానించారు. టిడిపి శ్రేణులు గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. వారు భారీ ర్యాలీగా వెళ్లి బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**అభివృద్ధిని చూసి ఓర్వలేక బురదజల్లే ప్రయత్నం**

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసిపి నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రులు అనిత, సవిత పేర్కొన్నారు. మంత్రులు స్థానిక టిడిపి నేత శివకుమార్ ఇంట్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి నాయకులు చేసిన తప్పును ఒప్పుకోకుండా ఆ తప్పును వేరే వారి మీద రుద్దడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తప్పు చేసిన వారిని చట్టం వదలబోదని గుర్తుచేశారు. లిక్కర్ స్కాంలో ఎంపి మిథున్‌రెడ్డిని అరెస్టు చేయగా వైసిపి నాయకులు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కూటమి నాయకులు శివకుమార్, దుర్గేష్, శశిధర్ పాల్గొన్నారు.

## వైసిపి మడకశిర సమన్వయకర్త హౌస్ అరెస్ట్



ఈరలక్కప్పను గృహ నిర్బంధం చేస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-మడకశిర రూరల్**


రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మడకశిర పర్యటన నేపథ్యంలో సోమవారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్పను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం ఈరలక్కప్ప వైసిపి శ్రేణులతో కలిసి మడకశిర వైపు వస్తుండగా కదిరేపల్లి క్రాస్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారిని అమరాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ కొద్దిసేపు ఉంచి అనంతరం వారి స్వగ్రామం తీసుకెళ్లి అక్కడ హౌస్ అరెస్ట్ చేసి ఉంచారు.

**వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తే అక్రమంగా అరెస్టు**

**మడకశిర :** ఏడుగుర్రాళ్లపల్లిలో దళిత బాలికపై అత్యాచార ఘటనకు సంబంధించిన హోం మంత్రి అనితకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన వైసిపి నాయకులను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై వారు మండిపడ్డారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మూర్తి, శేషాద్రి, సికిందర్, రంగనాథ, తిప్పేస్వామి మాట్లాడుతూ తాము మంత్రికి వినతి ఇచ్చేందుకు వెళ్లగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టుతో జగన్‌లో ఉలికిపాటు

**ప్రజాశక్తి-కదిరి టౌన్**



విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట

మద్యం కుంభకోణంలో వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో ఆ పార్టీ అధినేత జగన్‌లో ఉలికిపాటు మొదలైందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో సోమవారం కందికుంట మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం కుంభకోణానికి సూత్రధారి ఎంపి మిథున్‌రెడ్డి అయితే మూలవిరాట్ జగన్ అని ఆరోపించారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడే మద్యం కుంభకోణం జరిగిందని, ఇదే విషయాన్ని అప్పట్లో బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. చంద్రబాబు కూడా అప్పట్లోనే నగదు వ్యవహారాల్లో తేడా వస్తుందని పలు వేదికల్లో ప్రశ్నించారని గుర్తు చేశారు. అయితే అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచారణ జరగకుండా అప్పటి సిఎం జగన్ చూశారని ఆరోపించారు. మిథున్‌రెడ్డి అధికారి సత్యప్రసాద్‌కు ఉద్యోగోన్నతి ఆశ చూపి మద్యం కుంభకోణానికి తెరలేపారన్నారు. జగన్, సజ్జల రామకష్ణారెడ్డి, విజయ్‌సాయిరెడ్డి, కెసిరెడ్డి రాజ్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి ముఠాగా ఏర్పడి మద్యం కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ సందర్భంగా వైసిపి బ్లాక్ డేగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, జగన్ సిగ్గుతో తలదించుకోవాలన్నారు.

# హోంమంత్రికి ఉపాధ్యాయుల వినతి

**ప్రజాశక్తి-మడకశిర**

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను సోమవారం పట్టణంలో ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంత్రి అనితను ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.భూతన్న, జిల్లా కార్యదర్శి వివిఎన్.మాలింగప్ప, బి.ఈశ్వరప్ప, యుటిఎఫ్ నాయకులు వై.జోగప్ప శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ సమస్యలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఎమ్మెల్యే ఎంఎస్.రాజు క్యాంప్ ఆఫీస్‌లో మంత్రి వంగలపూడి అనితను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి పట్టు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ ఎం.పెద్దన్న, నాయకులు నరసింహులు, నాగరాజు, మంజు, శివకుమార్ పాల్గొన్నారు.

**రాష్ట్ర హోంమంత్రిని కలిసిన ఉద్యోగులు**

**మడకశిర రూరల్ :** మంత్రి అనితను మడకశిర, గుడిబండ ఐసిడిఎస్ సిడిపిఒలు నాగమల్లేశ్వరి, గంగరత్న, అంగన్వాడీ సూపర్వైజర్లు సన్నమ్, లీలావతి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు శ్రీదేవి, పద్మావతి, ఆరీఫా మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు, శాలువాలతో సత్కరించారు.

**యానిమేటర్‌పై ఫిర్యాదు**

**గుడిబండ :** మండలంలోని పిసి.గిరి గ్రామానికి చెందిన పలు మహిళా సంఘాల యానిమేటర్ గా పని చేస్తూ సంఘ సభ్యులు ఇచ్చిన రికవరీ డబ్బులను బ్యాంకుకు కట్టకుండా సుమారు రూ. 15 లక్షలు స్వాహా చేసి పరారైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘ సభ్యులు హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మహిళా సంఘం సభ్యులు మహాలక్ష్మి, షాతాజీ, పుట్టమ్మ, గంగమ్మ, శాంతమ్మ, సిద్ధగంగమ్మ ఉన్నారు.

**భూ పంపిణీ చేయాలని వినతి**

భూములు పంపిణీ చేసి ఆదుకోవాలని కోరుతూ మండలంలోని మోరుబగల్ గ్రామానికి చెందిన దళిత నాయకులు సుదర్శన్, జగదీష్, హనుమంతరాయప్ప, కరియన్న, మైలారప్ప, తిప్పేస్వామి, సన్నలింగప్ప, తదితరులు మంత్రి అనితకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 60 శాతం మంది దళితులు భూమిలేని వారు ఉన్నారని, కుటుంబ పోషణ భారమైందని, వ్యవసాయ భూమి పంపిణీ చేయాలని కోరారు.




నంబులపూలకుంటలో నిరసన

# ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విశేష సేవలు అందిస్తున్న ఆర్‌డిటికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని ఆర్‌డిటి సేవా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. నంబులపూల కుంటలో సోమవారం వారు మాట్లాడుతూ ఆర్‌డిటి సంస్థ ఎన్నో నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. పేదలకు విద్య, వైద్యంతో పాటు మహిళలకు ఎన్నో రకాలుగా చేయూత అందిస్తుంద న్నారు. అలాంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ సంస్థ కార్యకలాపాలను స్తంభింపజేసిందని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి ఆర్‌డిటికి తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, అంజనమ్మ, సరిత, మౌనిక పాల్గొన్నారు.

**పరిగి :** ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆ సంస్థ ద్వారా సాయం పొందిన విద్యార్థులతో పాటు పాఠశాల విద్యార్థులు సోమవారం పోస్ట్‌కార్డ్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని బీచిగానిపల్లి జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఆర్‌డిటి ప్రతినిధులు ఈశ్వరప్ప ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు పోస్ట్‌కార్డుల ద్వారా ఆర్‌డిటి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామాంజనప్ప, రామలింగప్ప, అనిత, కమల, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాల విద్యా ర్థులు ఆరుగురు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదివారం అనంతపురంలోని జూనియర్ కళాశాల మైదానంలో సబ్ జూనియర్స్, జూని యర్స్ బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. సబ్ జూనియర్స్ బాలుర విభా గంలో నవదీప్, బాలికల విభాగంలో ప్రణీత, జూనియర్స్ బాలుర విభాగంలో ఇబ్రహీం, ప్రదీప్, బాలికల విభాగంలో చరిత, జస్విత ఎంపికయ్యారని తెలిపారు. సబ్ జూనియర్స్ పోటీలు ప్రకాశం జిల్లాలో, జూనియర్స్ పోటీలు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణప్ప, సంజీవులు, కేశవయ్య, తరిగోపుల చౌదరి, ఉపాధ్యాయులు అహ్మద్ జాన్, వరదరాజులు, బాలాజీ, శ్రీదేవి, పుష్పలత, ప్రమీల, షాహినా, సుల్తానాబేగం, పద్మావతి, కామాక్షి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ పురస్కారం అందజేత

**ప్రజాశక్తి-రొద్దం**



సాహితీపురస్కారం అందుకుంటున్న తేజ

సాహిత్య రంగంలో విశేష సేవలు అందించిన తేజకు పురస్కారం అందినట్లు సోమవారం ఆయన తెలిపారు. హిందూపురం పట్టణంలోని సెవెన్ స్టార్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన భారతీయ ముస్లిముల లెజెండ్స్ పుస్తకావిష్కరణ సందర్భంగా తేజను ఘనంగా సన్మానించి ఫాదర్ విన్సెంట్ సాహితీ పురస్కారం అందజేశారు. తేజ మండలంలోని దొడఘట్ట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఆయన సాహిత్య రంగంలో విశేష సేవలు అందించినందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి గోపాల్‌గౌడ్, గజల్ శ్రీనివాస్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూక్ ఖాన్ తేజను సన్మానించి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహిత్య రంగంలో మరెన్నో సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

## పరిటాల శ్రీరామ్ చొరవతో పాఠశాలకు తాగునీరు

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ చొరవతో చిగిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా గత సోమవారం శ్రీరామ్ చిగిచెర్లలో పర్యటించగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాలలో రెండేళ్లుగా మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయడం లేదని, దీంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన శ్రీరామ్ ప్రత్యేక చొరవ తీసుకొని మరమ్మతులు చేయించడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది.

## వందమందికి చీరలు పంపిణీ

**ప్రజాశక్తి-నల్లమాడ**

మండలంలోని బాసమారపల్లికి గ్రామానికి చెందిన దుద్దుకుంట తిరుపాల్‌రెడ్డి భార్య, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ సునంద వర్ధంతి సందర్భంగా ఆమె కూతురు పరమేశ్వరి, అల్లుడు గోపాల్‌రెడ్డి సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వంద మందికి చీరలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తిరుపాల్‌రెడ్డి, వారి బంధుమిత్రులు పాల్గొన్నారు.

# బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

**ప్రజాశక్తి-పరిగి**

మండలంలోని ధనాపురం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు బదిలీపై మరో పాఠశాలకు వెళ్తుండగా సోమవారం హెచ్ఎం జ్యోతిర్మయి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. బదిలీ వెళ్తున్న ఉపాధ్యాయులు సుకన్య, రాధమ్మ, పద్మ, పాండురంగప్ప, మహేష్, దీపక్‌లను పాఠశాల స్థల దాత అంజనప్ప, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

## కుక్క అడ్డు రావడంతో బైక్ ప్రమాదం యువకుడు మృతి

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ద్విచక్ర వాహనం కింద పడడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని కాపుచనంపల్లి గ్రామం ముత్రాయనస్వామి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నంపల్లి గ్రామానికి చెందిన సతీష్(33) బైక్‌పై చిలమత్తూరుకు వస్తుండగా మార్గమధ్యలో కుక్క అకస్మాత్తుగా అడ్డం రావడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు హుటా హుటిన హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. సతీష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురంలో పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో పాటు 14 రోజులు రిమాండ్ కు పంపినట్లు హిందూపురం టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం తెలిపారు. హిందూపురం పట్టణంలో రహమత్ పురం ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉండి విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించాడు. సదరు వ్యక్తిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిపై ఎవరైనా దురుసుగా ప్రవర్తించినా, విధులకు ఆటంకం కలిగించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని సిఐ తెలియజేశారు.

## వివాహిత మిస్సింగ్.. కేసు నమోదు

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

బత్తలపల్లిలో బంధువుల ఇంట్లో ఉన్న తమ కూతురు కనిపించకుండా పోయిందని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. వివరాలు.. ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన బోయ రాజా, ముత్యాలమ్మ అలియాస్ దీపిక ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో రాజా తమ్ముడైన దుర్గాప్రసాద్ వారిద్దరినీ కలిపేందుకు బత్తలపల్లిలోని తన ఇంటికి పిలిపిం చాడు. ఈ నెల 17వ తేదీ రాజాకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో దుర్గాప్రసాద్ ఆర్‌డిటి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో ముత్యాలమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని దుర్గాప్రసాద్ ముత్యాలమ్మ తల్లికి ఫోన్ చేసి చెప్పినట్లు వారు తెలిపారు. దీపిక తల్లి ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## 'హనుమాన్ దర్శన్'ను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

శ్రావణమాసం సందర్భంగా 'హనుమాన్ దర్శన్' కోసం ధర్మవరం ఆర్టీసీ డిపో ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన బస్సు సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. కసాపురం, మురడి, నేమకల్లు పుణ్యక్షేత్రాల్లో వెలసిన ఆంజనేయస్వామిని భక్తులు ఒకేరోజు దర్శించుకునేందుకు వీలుగా ఈ నెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19, 23 తేదీల్లో బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. రాను పోను పెద్దలకు రూ. 600, పిల్లలకు రూ. 320 టికెట్ ధర ఉంటుందన్నారు. సీట్లను ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చాన్నారు. 50 మంది ఓ గ్రూపుగా ఏర్పడితే ప్రత్యేకంగా బస్సు నడుపుతామన్నారు. వివరాలకు 99592 25859, 73828 60418లో సంప్రదిం చాలన్నారు.

**రొద్దం :** హనుమాన్ దర్శనం కోసం పెనుకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ రంగ భాష్యం తెలిపారు. పెద్దలకు రూ. 660, పిల్లలకు రూ. 330 టికెట్ అన్నారు. వివరాలకు 9959229965లో సంప్రదించాలన్నారు.

## శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

మండలంలోని టిఎన్.పల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమెన్స్ శక్తి యాప్ గురించి సమావేశం నిర్వహించారు. శక్తి టీం ఇన్‌ఛార్జి అధికారి మంజుల చైల్డ్ చట్టాలపై అవగాహన కల్పిం చారు. చిన్న పిల్లలు డ్రగ్స్, గంజాయి, తదితర మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకో వద్దన్నారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైసిపి విమర్శలపై టిడిపి మండిపాటు

**ప్రజాశక్తి-లేపాక్షి**

హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని టిడిపి మండల కన్వీనర్ అభిలాష్ హితవు పలికారు. లేపాక్షిలో ఆదివారం నిర్వహించిన వైసిపి విస్తృతస్థాయి సమావేశం లో ఆ పార్టీ నాయకులు చేసిన విమర్శలను సోమవారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశం తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోనే హిందూపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, టిడిపిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైసిపి హయాంలో ప్రతి వ్యవస్థను నాశనం చేయడమే కాకుండా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రతి చోటా దౌర్జన్యాలు, హత్యలు, ఆక్రమణలు చేసిన ఘనత వారికే దక్కుతుంద న్నారు. హిందూపురంతో పాటు లేపాక్షి మండలాన్ని భవిష్యత్తులో పారిశ్రామికవాడగా అభివృద్ధి చేయడమే కాకుండా విద్యావంతులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తుందన్నారు. ఎమ్మెల్యే బాలయ్య సొంత నిధులతో విద్య, వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. మద్యం కేసులో ఎంపి మిథున్‌రెడ్డి, జగన్ పాత్రధారులకు జైలు తప్పదన్నారు. ఇకనైనా పురం వైసిపి నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సర్పంచి సిద్ధార్థ, వీరశేఖర్, రామాంజనమ్మ, మారుతి, ప్రసాద్, కిష్టప్ప, సూర్యప్రకాష్, శ్రీరాములు, గోవింద్, మంజునాథ్, లక్ష్మీనారాయణరెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

## మంత్రికి నాయీ బ్రాహ్మణుల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణులు

**ప్రజాశక్తి-రొద్దం**

నాయీ బ్రాహ్మణుల కోసం కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ మండల నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం రాత్రి పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంత్రి సవితను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రొద్దంలో స్థలం కేటాయించడంతో పాటు కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టాలని వారు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి అధికారులతో సంప్రదించి కమ్యూ నిటీ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు రవికుమార్, ఉపాధ్యక్షులు మంజునాథ్, ట్రెజరర్ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పొలాలకు సర్వీస్ రోడ్డు వేయాలి

**ప్రజాశక్తి-గోరంట్ల**

మండలంలోని బూదిలివాళ్లపల్లి వద్ద రైతులు పొలాలకు వెళ్లేందుకు జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు వేయాలని కోరుతూ సోమవారం కొండాపురం పంచాయతీ రైతులు సోమశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. సోమశేఖర్‌శర్మ మాట్లాడుతూ కదిరి నుంచి హిందూపురం వరకూ జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయని, అయితే సర్వీస్ రోడ్డు లేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కొండాపురం పంచాయతీలోని రెడ్డిచెరువుకు వచ్చే సప్లై ఛానల్ కాలువలు పూడిపోయాయని, ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికతీత పనులు చేపట్టి చెరువుకు నీరందించాలని కోరారు. అలాగే శివరాంపురం గ్రామాన్ని గెజిట్‌లో చేర్చాలన్నారు.